
సాక్షి ఒడిశా

బుధవారం, 6, ఆగస్టు, 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,98,254లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 46గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

అసమర్థులపై చర్యలకు సన్నద్ధం

భువనేశ్వర్: అసమర్థ ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల అమలు, కార్యాచరణ తదితర ప్రభుత్వ ఉద్యోగ సంబంధిత సేవల్లో అనుబంధ వర్గాల కార్య దక్షతని పరిశీలిస్తారు. విధుల నిర్వహణ రంగంలో అసమర్థత రుజువు అయితే ఉద్యోగం నుంచి అనివార్య విరామం కల్పించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో సిబ్బంది, అధికారుల పని తీరు సమర్థత సంబంధిత సమాచారంతో పూర్తి వివరాలు దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం తరచూ జారీ చేస్తున్న ఉత్తర్వులు, నిర్ణయాలు వాస్తవంగా ఎంతవరకు అమలవుతున్నాయో క్షుణ్ణంగా పరిశీలించదలిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ నాటికి ఆదేశాల మేరకు సమగ్ర సమాచారంతో కూడిన వివరాలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ సమాచారం ఆధారంగా అధికారులు, ఉద్యోగుల పని శైలిపై వివరణాత్మక సమీక్ష నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

భారీగా విదేశీ మద్యం పట్టివేత



అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితిలో పోడియా పోలీసులు సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఒక బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 165 లీటర్ల విదేశీ మద్యాన్ని పట్టుకున్నారు. దీంతో రవాణా చేస్తున్న ధర్మేంద్ర కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఆయనను విచారించగా కలిమెల సమితి ఉండ్రుకొండ గ్రామంలో ఈ మద్యం అమ్మకానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను కోర్టుకు తరలించినట్లు పోడియా ఐఐసీ నిరోద్ కుమార్ బాగ్ తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



సత్యనారాయణ వ్రతంలో మహిళలు

రాయగడ: శ్రావణమాసం పవిత్ర దినాల్లో భాగంగా మంగళవారం స్థానిక బాలాజీ నగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో పుత్రదా ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, పుష్పార్చన పూజలు చేశారు. అనంతరం శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయిన ఇల్లు

జయపురం: జయపురం పట్టణంలోగల హైదరాబాద్ లైన్‌లో మంగళవారం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువైన ఆస్తి కాలిబూడిదైంది. హైదరాబాద్ లైన్‌లో సయ్యద్ మహమ్మద్ ఇంటిలో ఎలక్ట్రికల్ సామాన్లు ఇతర వస్తువులు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అగ్ని ప్రమాదం మంటలు చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక విభాగానికి తెలియ జేసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ప్రమాదంలో కాలిపోయిన వస్తువుల విలువ దాదాపు రూ.4 లక్షలు ఉంటుందని ఇంటి యజమాని వెల్లడించారు. అగ్నిమాపక విభాగ ఏఎస్‌సీ బారిక్ అగ్నిమాపక సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయం తెలిసి మహమ్మద్ కుటుంబం ఇంటికి చేరుకున్నారు.

చోరీ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులకు జిల్లా అదనపు జడ్జి వర్షా దాస్ మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. అదేవిధంగా ఒక్కొక్కరూ రూ.10 వేల జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో 7 నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్ష పడినవారిలో అశ్రఫుల్ షేక్, మహ్మద్ రాని శేఖ్, మహ్మద్ అలిమిన్, శేఖ్ బాబు, సమీర్ శేఖ్‌లు ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది మే 13వ తేదీన స్థానిక డీఎఫ్‌వో కార్యాలయం సమీపంలోని మూడోలైన్‌లో నివసిస్తున్న బసంత కుమార్ స్వయి అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసుకుని కుటుంబంతో తమ సొంత గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో మే 17వ తేదీన గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లోని రూ.60 వేల నగదు, బంగారు ఆభరణాలు దొంగిలించుకు వెళ్లినట్లు మే 18వ తేదీన బాధితుడు బసంత కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించి సోమవారం 11 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం ఈ మేరకు నిందితులకు జైలు శిక్షను విధించింది.

దుకాణాలపై.. ఎస్‌టీఎఫ్ దాడులు

భువనేశ్వర్:

కళాశాలలు తదితర విద్యా సంస్థల సమీపంలోని దుకాణాల్లో రహస్యంగా మాదక ద్రవ్యాల విక్రయాలు జోరందుకుంటున్నట్లు సమాచారం అందడంతో ఒడిశా పోలీసుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. మంగళవారం నగర వ్యాప్తంగా ప్రముఖ విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో సందిగ్ధ దుకాణాలపై దాడులు నిర్వహించింది. దాడుల్లో భాగంగా దుకాణంలో విక్రయం అవుతున్న సామగ్రి తనిఖీ చేసింది. తనిఖీల్లో పలు సందిగ్ధ మాదక ద్రవ్యాల్ని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి పరీక్షల కోసం సన్నాహాలు చేపట్టారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు అనుమానిస్తున్న దుకాణాలను లక్ష్యంగా చేసుకుని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. విద్యా సంస్థల సమీపంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టడానికి కీలక ప్రాంతాలలో ఆకస్మిక దాడులు ప్రారంభించినట్లు వివరించారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా ప్రముఖ విద్యా సంస్థలకు నిలయంగా ప్రసిద్ధి చెందిన పటియా, ఖండగిరి ప్రాంతాల్లో నగర కమిషనరేటు పోలీసులు, ఎస్‌టీఎఫ్ బృందాలు సమన్వయంతో దాడులు నిర్వహించాయి. విద్యార్థులు, యువతకు నిషేధిత పదార్థాలను విక్రయిస్తున్నట్లు అనుమానిస్తూ కళాశాల క్యాంపస్‌ల సమీపంలో ఉన్న చిన్న దుకాణాలు, కియోస్కలను గురి పెట్టి ప్రత్యేకంగా ఈ దాడులు చేపట్టడం విశేషం. విద్యార్థులు ఎక్కువగా ఉండే క్యాంపస్ తదితర ప్రాంతాల్లో చుట్టుపక్కల బ్రౌన్ షుగర్, గంజాయి (గంజాయి) వంటి మాదక ద్రవ్యాల అమ్మకాలకు సంబంధించి విశ్వసనీయ రహస్య సమాచారం



కళాశాలల సమీపంలోని దుకాణాల్లో మాదక ద్రవ్యాల రహస్య విక్రయంపై ఎస్‌టీఎఫ్ తనిఖీలు

ఆధారంగా ఈ చర్యకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సు నడుం బిగించింది. రహస్యంగా మాదకద్రవ్యాల విక్రయం యువకులను వ్యసనానికి ప్రేరేపిస్తుందనే ఆరోపణలు బలం పుంజుకున్నాయి. ఈ ప్రభావాన్ని ఆదిలోనే అణగదొక్కాలనే దృఢ సంకల్పంతో దాడులు, తనిఖీలు కొనసాగిస్తున్నట్లు అధికారి ఒకరు తెలిపారు. దాడుల సమయంలో అనేక దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పలు సందిగ్ధ మాదక ద్రవ్యాల్ని స్వాధీనపరచుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ పరీక్షల కోసం నమూనాలను సిఫారసు చేశారు. నగరంలో విద్యా సంస్థల పరిసర దుకాణాల్లో రహస్యంగా మాదక ద్రవ్యాల విక్రయాల



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న అనుమానిత వస్తువులు

కట్టడికి క్రైం శాఖ లోగడ దాడులు నిర్వహించింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పునరుద్ఘాటించారు.

రహస్య కెమెరాతో ...

శ్రీ మందిరం ప్రవేశానికి విఫలయత్నం



భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానం లోపలి ప్రాకారంలో దృశ్యాల చిత్రీకరణ పూర్తిగా నిషేధం. ఇటీవల కాలంలో ఈ నిషేధ ఆంక్షల్ని అధిగమించి అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో పవిత్ర శ్రీ మందిరం లోపలి దృశ్యాల్ని చిత్రీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంగళ వారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిపుల్ పాల్ అనే భక్తుడు రహస్య కెమెరా అమర్చిన కళ్లజోడుతో ప్రవేశించి శ్రీ మందిరం లోపలి దృశ్యాలు చిత్రీకరించబోయి పట్టుబడ్డాడు. గత 8 రోజుల స్వల్ప వ్యవధిలో ఇలాంటి సంఘటన వరుసగా ఇది మూడోది కావడంతో శ్రీ మందిరం భద్రతా వ్యవస్థ నిర్వాహక వర్గాలు కలవరపడుతున్నాయి. తాజా సంఘటనలో శ్రీ మందిరం పశ్చిమ ద్వారం ప్రాంగణంలో భక్తుని సందిగ్ధ కదలికలపై సందేహించిన ఆలయ పోలీసులు అదుపులోకి తీసుకుని పరిశీలించారు. పరిశీలనలో సందేహం ధ్రువీకరించి సింహ ద్వారం ఠాణా పోలీసులకు నిందితుడిని అప్పగించారు. అతడికి వ్యతిరేకంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సింహ ద్వారం ఠాణా పోలీసు వర్గాలు తెలిపాయి.

ఆలయ భద్రత కోసం ప్రత్యేక ఎస్‌ఓపీ జారీ: ఎస్పీ

శ్రీ మందిరం లోపలి దృశ్యాల అక్రమ చిత్రీకరణ కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా తెలిపారు. ప్రధానంగా ఇటీవల కాలంలో రహస్య కెమెరా అమరికతో కళ్లజోడు ధరించి లోనికి ప్రవేశించి అలజడి రేపుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ చర్యల కట్టడికి త్వరలో నిర్ధారిత కార్యాచరణ విధానం ఎస్‌ఓపీ జారీ చేయనున్నట్లు ఎస్పీ వివరించారు. రహస్య కెమెరా కళ్లజోడు వ్యవహారం గుర్తించడంలో భద్రతా సిబ్బందికి ప్రత్యేక తర్ఫీదు కల్పిస్తారు. అవసరమైతే, మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొంత మంది యూట్యూబర్లు డబ్బు సంపాదించడం కోసం ఇలా చేస్తున్నారు. దీనిని నివారించడానికి ఒక చట్టం తీసుకురావాలని శ్రీ మందిరం పాలక మండలితో చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు.

శ్రమదానంతో కర్ర వంతెన ఏర్పాటు



నదిపై కర్ర వంతెనను నిర్మిస్తున్న గ్రామస్తులు

● తీరిన నదీ కష్టాలు

రాయగడ: నది మీదుగా తమ గ్రామానికి వెళ్లేందుకు వీలుగా గ్రామస్తులు శ్రమదానంతో కర్ర వంతెనను నిర్మించుకున్నారు. ఎవరో వస్తారని ఎదురు చూడకుండా తమ రాకపోకలకు మార్గం సుగమమం చేసుకున్నారు. జిల్లాలోని కాసీపూర్ సమితి గొడిబాల్లి పంచాయతీ పరిధిలోని పనసగుడ గ్రామానికి చేరాలంటే మధ్యలో ఉన్న నదిని దాటుకుంటూ వెళ్లాల్సిందే. వర్షాకాలంలో వరద ప్రభావంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు వంతెనను నిర్మించాలని అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులంతా ఏకమై సమీపంలోని అడవుల నుంచి కర్ర దుంగలను సమీకరించారు. వీటితో సుమారు పది అడుగుల దూరం వరకు నదిపై వంతెనను నిర్మించుకుని రాకపోకలకు మార్గం సుగమం చేసుకున్నారు. ఈ గ్రామం మీదుగా మరో అయిదు గ్రామాలకు చెందిన ప్రజలకు రాకపోకలకు అవకాశం వచ్చింది.

కొండచిలువ కలకలం



పట్టుబడిన కొండచిలువ

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి కేంద్రంలో కైలాస్ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం రాత్రి ఆవుల కోసం మేత ఉంచిన గదిలో కొండచిలువ కలకలం సృష్టించింది. దీంతో వెంటనేవారు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతరం స్నేక్ క్యాచర్ వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. దీనిని సమీప కోరుకొండ సమితి సమీప అడవిలో వదిలేశారు.

పాముకాటుతో యువకుడికి అస్వస్థత

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీ పర్లాపాయి గ్రామానికి చెందిన కార్తీ పిడిసిక అనే యువకుడు పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. పర్లాపాయి గ్రామానికి చెందిన కార్తీ పిడిసిక తమ పొలంలో కాపుకాసిన మొక్కజొన్న పొత్తులను సేకరించేందుకు వెళ్లాడు. మొక్కజొన్న పొత్తులు ఏరుతున్న సమయంలో ఒక పాము అతని కాలిపై కాటు వేయడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. పొలంలోకి వెళ్లిన కార్తీ ఇంటికి రాలేదని తండ్రి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో గ్రామస్తుల సాయంతో ఇంటికి తీసుకొచ్చి నాటువైద్యం చేయించాడు. అయితే నాటువైద్యం వల్ల ఎటువంటి ఫలితం దక్కకపోవడంతో వెంటనే అతనిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికి



చికిత్స పొందుతున్న కార్తీ పిడిసిక

త్సావస్థలో ఉన్న కార్తీ ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు చెబుతున్నారు.

వ్యాపారి దారుణ హత్య



మృతదేహాన్ని పూడ్చి వేసిన స్థలానికి నిందితుడిని తీసుకువచ్చిన నందపూర్ పోలీసులు



సోమనాథ్ (ఫైల్)

రాయగడ : ఒక వ్యాపారిని అత్యంత దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని స్థానిక హలువ తోట సమీపంలో గల శ్మశానంలో పూడ్చివేసిన ఘటనకు సంబంధించి కొరాపుట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం నాడు దుండగుడిని తీసుకువచ్చి పూడ్చి వేసిన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. వివరాల్లోకి వెళితే.. కొరాపుట్ జిల్లాలోని నందపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మెడిపూట్ గ్రామానికి చెందిన సామనాథ్ జాని (34) అనే పనసకాయల వ్యాపారిని హత్య చేసిన అనంతరం ఆ మృతదేహాన్ని దుండగులు రాయగడ సమీపంలో గల హలువా తోటకు దగ్గరలో గల శ్మశానంలో పూడ్చి వేశారు. గత మూడు నెలలుగా వ్యాపారం కోసం వెళ్లిన సోమనాథ్ కనిపించడం లేదని కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సామనాథ్ హత్యకు గురయ్యాడని తెలుసుకుని అందుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో వారిని దర్యాప్తు చేయగా విషయం బయట పడింది. తామే వ్యాపారి సోమనాథ్‌ను హత్యచేసి మృతదేహాన్ని రాయగడకు తీసుకువెళ్లి పూడ్చి వేశామని నిందితులు పోలీసుల వద్ద అంగీకరించారు. ఈ మేరకు నిందితుల్లో ఒకరిని నందపూర్ పోలీసులు మంగళవారం నాడు రాయగడ తీసుకువచ్చి మృతదేహాన్ని పూడ్చివేసిన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.



మృతదేహాన్ని పూడ్చివేసిన స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాయగడలో రాఖీ ఉత్సవాలు ప్రారంభం

● విక్రయ స్టాళ్లు ఏర్పాటు

రాయగడ: ఒడిశా రూరల్ డెవలప్‌మెంట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ (ఒర్మాస్), జిల్లా యంత్రాంగం సంయుక్తంగా స్థానిక కొత్తబస్టాండు సమీపంలోని ట్రైబల్ వరల్డ్ వద్ద రాఖీ ఉత్సవాలను ఏర్పాటు చేసింది. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ్ కుమార్ ఖెముండొ ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు రూపొందించిన ఈ రాఖీలను ఖరీదు చేయాలని పిలుపునిచ్చారు. వీటి అమ్మకాలతో వారికి మనం ఆర్థికంగా ఆసరా కల్పించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. వెదురు వంటి సహజ సిద్ధమైన ముడిసరుకును వినియోగించి అతి సుందరంగా తయారు చేసిన రాఖీలు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయని అన్నారు. ఓర్మాస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జి.లక్ష్మణరావు మాట్లాడుతూ.. స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలను ప్రొత్సాహించాలన్న ముఖ్యఉద్దేశంతో రాఖీ ఫెస్టివల్ పేరిట విక్రయ కేంద్రాన్ని నిర్వహించామని అన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు విక్రయ కేంద్రం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, ప్రజా సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బసంత కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.



రాఖీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న అక్షయ కుమార్ ఖెమండో, ఇతర అధికారులు



పూసలతో తీర్చిదిద్దిన రాఖీలు



వెదురుతో తయారు చేసిన రాఖీలు



ఊలుతో రూపొందించిన రాఖీలు



ఒర్మాస్ పేరిట రంగురంగుల రాఖీలు

క్లుప్తంగా

ఒడిశా రాష్ట్ర మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా శోభన మహంతి


శోభన మహంతి

భువనేశ్వర్: శోభన మహంతి రాష్ట్ర మహిళా కమిషన్ కొత్త చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నియామకం మొదలుకొని ఆమె మూడేళ్ల పాటు నిరవధికంగా ఈ హోదాలో కొనసాగుతారు. శోభన మహంతి బాలాసోర్ జిల్లా రెమూణ ప్రాంతానికి చెందిన వారు. మరో నలుగురిని మహిళా కమిషన్ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రతిభ శత్పతి, ఊర్మిళ మహాపాత్రో, కల్పనా మల్లిక్, ముక్తా సాహు మహిళా కమిషన్ సభ్యులుగా నియమితులైనట్లు పేర్కొన్నారు.

అరాచక పాలన.. మరో ఉదాహరణ


రిమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్న ధనలక్ష్మి

- టీడీపీ వేధింపులకు గురైన మహిళ ఆత్మహత్యాయత్నం
- డీలర్‌షిప్ రద్దు చేసి వేరొకరికి కట్టబెట్టడంతో మనస్తాపం
- బతుకు తెరువు లేక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి అరాచక పాలనకు మరో ఉదాహరణ తారసపడింది. ఆమదాలవలస నియోజకవర్గంలో ఈ అరాచకం పరాకాష్టకు చేరింది. అసలే ఇసుక మాఫియా, భూ దందాలతో ఈ నియోజకవర్గం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. దీనికి వేధింపులు తోడవుతున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా లేని వారు మనుషులే కాదన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఏ పార్టీకి సంబంధం లేకపోయినా వారి జీవన హక్కును కూడా కాలరాస్తున్నారు. కూటమి పాలకుల కుట్రకు ఓ మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. పదేళ్లుగా ఆమె నిత్యావసర సరుకుల డీలర్‌షిప్ నిర్వహిస్తుంటే.. కేవలం తమ అనుకూలురుకు ఇచ్చేందుకు ఆమె డీలర్‌షిప్‌ను రద్దు చేశారు. దీనిపై ఆమె కోర్టుకు వెళితే కేసు ఉంటుండగానే మరొకరికి ఆ డీలర్‌షిప్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో ఆమదాలవలస మండలం మునగవలస గ్రామానికి చెందిన మునగవలస ధనలక్ష్మి మంగళవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కార్యాలయానికి వస్తున్న సమయంలో విషం తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. వివరాల్లోకి వెళితే..

ఆమదాలవలస మండలం మునగవలస గ్రామానికి చెందిన మునగవలస శారదాంబ ఊరిలో రేషన్ డీలర్‌షిప్ నిర్వహించేవారు. ఆమె గతంలో చట్టపరంగా ఒక బాలికను దత్తత తీసుకున్నారు. ఆమెనే వారసురాలిగా ప్రకటించారు. శారదాంబ నిర్వహించే ఎఫ్‌పీ షాపు నిర్వహణ కూడా తన వారసురాలు ధనలక్ష్మికి అప్పగించారు. గత ప్రభుత్వం హయాంలో ఎలాంటి సమస్య లేకుండా ఆమె పనిచేసుకున్నారు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆమెకు వేధింపులు ప్రారంభమయ్యాయి. దీంతో కొందరు గ్రామస్తులు షాపును డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. అయినా డ్వాక్రా గ్రూపు లీడర్‌గా ధనలక్ష్మి ఆ షాపును నిర్వహించేవారు. కానీ ఇప్పుడు ఆమె డీలర్ షిప్‌ను రద్దు చేసి వేరొకరికి ఆ బాధ్యతలు అప్పగించేందుకు టీడీపీ వర్గీయులు ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ కుట్రలు తెలుసుకున్న ధనలక్ష్మి తన డీలర్ షిప్‌ను నిలబెట్టుకునేందుకు హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసులో కోర్టులోనే ఉన్నా టీడీపీ నాయకులు వెరవకుండా వేరొకరికి డీలర్‌షిప్ కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. న్యాయస్థానంలో ధనలక్ష్మికి వ్యతిరేకంగా అఫిడవిట్ కూడా దాఖలు చేశారు. విషయం తెలుసుకున్న ధనలక్ష్మి తనకు ఉపాధి పోతుందన్న భయంతో మంగళవారం ఉదయం సుమారుగా 11 గంటల సమయంలో కలెక్టరేట్ వద్ద విషం తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. వెంటనే అక్కడున్న వారు ఆమెను పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు రిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ధనలక్ష్మి రిమ్స్‌లో అత్యవసర విభాగంలో వైద్య సేవలు పొందుతోంది.

'ఆదికర్మయోగి'పై శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆదివాసీ ప్రాంతాల్లో పనిచేసే అధికారులకు ఆది కర్మ యోగి శిక్షణ ద్వారా పరిపాలనలో సమర్థత పెరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం, గ్రామ స్థాయిలో శాశ్వత మార్పులకు దోహదపడుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులకు ఆది కర్మ యోగి-రెస్పాన్సివ్ గవర్నెన్స్ ప్రోగ్రాంపై ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థంగా చేరాలంటే, అధికారులు వారి జీవన పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇది ఒక వినూత్నమైన ప్రజా భాగస్వామ్య కార్యక్రమమని గ్రామాల్లో యువత, మహిళలు, వలంటీర్లను శిక్షణతో నైపుణ్యం కలిగించి, స్థానిక సేవలలో మార్పునకు మార్గం వేయాలన్నదే లక్ష్యమని చెప్పారు.

స్వాతంత్ర్య వేడుకలకు సన్నాహాలు


హేమంత్ శర్మ అధ్యక్షతన స్వాతంత్ర దినోత్సవ సన్నద్ధత సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి హేమంత్ శర్మ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆగస్టు 15న జరగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ఏర్పాట్లు ఖరారు చేశారు. ఈ సంవత్సరం, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రాష్ట్ర స్థాయి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. స్థానిక మహాత్మా గాంధీ మార్గ్‌లో జరిగే కవాతులో ఆయన జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. ఈ నెల 11 నుంచి 13 వరకు పరేడ్ ప్రదర్శన సాధన చేస్తారు. ఆగస్టు 15న జరిగే ప్రధాన కార్యక్రమంలో ఉదయం బిగుల్ కాల్, ఉత్సవ రామ్‌ధున్, టీవీ మరియు సోషల్ మీడియా చానెళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసార కవరేజ్ ఉంటాయి. రాజ్ భవన్ నుంచి పరేడ్ గ్రౌండ్ వరకు దారి పొడవునా ప్రత్యేక అలంకరణతో సౌందర్య ఆకర్షణను పెంచాలని శర్మ సూచించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన సంస్థలు విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. రాష్ట్రం అంతటా జిల్లా మరియు సబ్-డివిజన్ స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో ఉత్తమ బృందాలు, ప్రదర్శన వర్గాలకు అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా సమాచారం, ప్రజా సంబంధాలు విభాగం ప్రచురించిన ఉత్కళ్ ప్రసంగ్, ఒడిశా రివ్యూ (ఆంగ్లం) ప్రత్యేక సంచికలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. ఆహ్వాన పత్రికల ముద్రణ, పంపిణీని వ్యవహారం రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాలు విభాగం పర్యవేక్షిస్తుంది.

ఈ సమావేశంలో డివిజనల్ డైరెక్టర్ అనుజ్ కుమార్ దాస్ పట్నాయక్, అదనపు కార్యదర్శి బిష్ణు ప్రియ సాహు, డిప్యూటీ డైరెక్టర్ (రీజియన్) సుచేతా ప్రియదర్శిని, ఆర్థిక సలహాదారు పృథ్వీ రాజ్ పాణి తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీల్లో బర్షితా దాస్ ప్రతిభ


ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు


బంగారు పతకం సాధించిన బర్షితా దాస్

పర్లాకిమిడి: రాష్ట్ర స్థాయి అస్మితా తైక్వాండ్ లీగ్ పోటీలు భద్రక్ జిల్లాకేంద్రంలోని బిజూ పట్నాయక్ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల రెండు, మూడు తేదీల్లో జరిగాయి. వాటిలో ఒడిశా నుంచి 250 మంది బాలికలు పాల్గొనగా.. గజపతి జిల్లా తైక్వాండో అకాడమి నుంచి నలుగురు మహిళా క్రీడాకారులు హాజరయ్యారు. వాటిలో ముఖ్యంగా రెండు విభాగాలలో పోటీ జరిగింది. ఈ పోటీలు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరగ్గా ఖేలో ఇండియా నిర్వహించింది. వీటిలో పర్లాకిమిడికి చెందిన బర్షితా దాస్ స్వర్ణం, కాంస్య పతకాలు సాధించగా, పి.సాయిస్మితా వెండి, అనుష్కా అనహితా సాహు వెండి పతకాలు సాధించారు. ముగ్గురు పర్లాకిమిడి నుంచివిజేతలుగా నిలిచినందుకు జిల్లా తైక్వాండ్ అకాడమి కోచ్ కార్తీక్ మహాపాత్రో అభినందనలు తెలియజేశారు. గజపతి జిల్లా తైక్వాండో అకాడమి గౌరవ అధ్యక్షులు కోడూరు నారాయణరావు విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు కంటిఅద్దాల పంపిణీ


కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

జయపురం: జయపురం పట్టణం, సమితి ప్రాంతాలలోని వివిధ ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. స్థానిక బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయంలో విద్యా విభాగ సాధన కేంద్రంలో నేత్ర పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మంది విద్యార్థులకు కంటిఅద్దాలను సమకూర్చారు. కార్యక్రమంలో సమితి విద్యాధికారి కె.గోపాలరావు, సమితి అధికారి సోమనాథ్ గదబ, సమితి రిసోర్స్ పర్సన్ డాక్టర్ సుభద్రా పాత్రో, ఎస్.గణేష్ ప్రసాద్ చౌధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యు కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు



భువనేశ్వర్: సుపరిపాలన చర్యల్లో భాగంగా సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బయోమెట్రిక్ హాజరు నమోదు వ్యవస్థని ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. ఈ దిశలో రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం తొలి అడుగు వేయడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యు కార్యాలయాల్లో సిబ్బంది సకాలంలో విధులకు హాజరు విషయం పరిశీలనకు అనుకూలంగా బయోమెట్రిక్ వ్యవస్థని అమలు చేయాలని విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి దిగంత రౌత్రాయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు లేఖలు రాశారు. ఈ మేరకు సత్వర చర్యలు చేపట్టి బయోమెట్రిక్ వ్యవస్థ ఏర్పాటు సమగ్ర వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. గత నెల 21వ తేదీన రాష్ట్ర రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి కటక్ ప్రాంతంలో విభాగం ప్రభుత్వ కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా అత్యధిక సిబ్బంది, అధికారులు గైర్హాజరుని మంత్రి గుర్తించారు. ఆరా తీయగా ఆలస్యంగా విధులకు హాజరు అవుతున్నట్లు తేలింది. దీంతో మంత్రి బయోమెట్రిక్ హాజరు నమోదు వ్యవస్థ అమలు కోసం ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన వాస్తవ కార్యాచరణకు సన్నాహాలు ఊపందుకున్నాయి.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కొత్త అధ్యక్షురాలిగా బబితా పాత్రో



భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఓఎస్‌సీపీసీఆర్) అధ్యక్షురాలిగా బబితా పాత్రోను నియమించినట్లు మంగళ వారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరో ఆరుగురిని ఈ కమిషన్ సభ్యులుగా నియమించారు. బబితా పాత్రో బరంపురం సోమనాథ్ నగర్ మయూర్ విహార్ నివాసిని. ఆరుగురిని ఒడిశా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులుగా నియమించారు. వారిలో సుకేషి ఓరం (చంపువా - కెంజొహార్), కల్పనా లెంక (బసంతి కాలనీ, రౌర్కెలా), చందనా దాస్ (బొడొగొడొ బ్రిట్ కాలనీ, భువనేశ్వర్), కస్తూరి మిశ్రా (బాపూజీ నగర్, భువనేశ్వర్), మనస్మిత ఖుంటియా (చౌరొంపా, భద్రక్), సుజాతా నాయక్ (బొమిఖల్, భువనేశ్వర్) ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు


తల్లిపాలు ప్రాధాన్యతను వివరిస్తున్న డాక్టర్ హుస్సేన్


వేదికపై వైద్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.ఎం.ఆవిడ్ హుస్సేన్ హాజరై తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు విధిగా పాలు పెట్టాలన్నారు. డాక్టర్ హుస్సేన్ తల్లిపాలు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్ రాజ్, ఓం ప్రకాష్‌షా పాల్గొన్నారు.

అడవి పందుల కోసం వలవేస్తే..
ఎలుగుబంట్లు చిక్కాయి!


వేటగాళ్లు అమర్చిన వలలో చిక్కిన ఎలుగుబంటి


వలలో చిక్కిన ఎలుగు పిల్లలు

మల్కన్‌గిరి: అడవి పందుల కోసం వేసిన వలలో ఎలుగుబంట్లు చిక్కాయి. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా మాత్తిలి సమితి బురిడిగూడ రిజర్వ్ అడవిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అటుగా పెట్రోలింగ్ కోసం వెళ్లి అటవీ సిబ్బందికి వలలో చిక్కకొని గాండ్రిస్తున్న తల్లీపిల్ల భల్లూకాలు తారసపడ్డాయి. దీంతో సహాయక చర్యలు ప్రారంభించారు. అటవీశాఖ మాత్తిలి ప్రాంత ఫీల్డ్ సిబ్బంది ర్యాపిడ్‌రెస్పాన్స్ బృందంతో కలిసి వలలో చిక్కుకున ఎలుగుబంట్లను సురక్షితంగా బయటకు తీశారు. వెంటనే అవి సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయాయి. అటవి జంతువులను వెటాడే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని సిబ్బంది హెచ్చరించారు.


సహాయక చర్యల్లో అటవీశాఖ సిబ్బంది

పంటల సాగుపై దృష్టిసారించాలి


సమీక్షా సమావేశంలో కలెక్టర్ కులకర్ణి తదితరులు

- కలెక్టర్ అశుతోష్ కులకర్ణి

రాయగడ: జిల్లా కలెక్టర్ కార్యాలయం సద్భావనా సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అధ్యక్షతన జిల్లాస్థాయి వ్యవసాయ ప్రణాళిక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఏ పంటలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు, రైతులకు ఎటువంటి వాణిజ్య పంటలు వారికి మేలు చేకూరుస్తాయి తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగునీటి వనరులు, విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంటున్నాయా..లేదా అని ఆరా తీశారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి పెంచడంతోపాటు వాటిని సంరక్షించడంపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. నూనెగింజలు, వాణిజ్య పంటల్లో భాగంగా పత్తి, తృణధాన్యాల సాగును విస్తృతపరచాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. సేంద్రియ ఎరువల వినియోగంతో కలిగే లాభాల గురించి తెలియజేయాలని సూచించారు. దీని ద్వారా సాగుభూములు సారవంతాన్ని కోల్పోవన్న విషయం రైతులకు పూర్తిగా అవగాహన కలిగేలా సంబంధిత శాఖ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా కలిగే ప్రయోజనాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 43,201 హెక్టార్లలో వివిధ పంటలను పండించేందుకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యంగా పెట్టుకున్నట్టు వ్యవసాయశాఖాధికారులు వివరించారు.

సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన


శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ తదితరులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని బలిమెల కూడాలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ మంగళవారం శంకుస్థాపన చేశారు. సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు తప్పుతాయన్నారు.

మల్కన్‌గిరి పురపాలక సంఘ చైర్మన్ మనోజ్ మారిక్, వైస్ చైర్‌పర్సన్ కవితా మోహంతి, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ చంద్రసోభరో, వార్డు సభ్యుడు హజార్ పాల్గొన్నారు.

దులీప్ ట్రోఫీకి
విజయ్ ఎంపిక



- జిల్లా నుంచి దులీప్ ట్రోఫీకి ఎంపికైన మొట్టమొదటి క్రికెటర్‌గా గుర్తింపు
- బీసీసీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో జరగనున్న పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: టెక్కలికి చెందిన క్రికెటర్ త్రిపురాణ విజయ్ మరో మెగా టోర్నీకి ఎంపికయ్యాడు. బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో మెరవనున్నాడు. ఈ పోటీలు సెప్టెంబర్‌లో జరగనున్నాయి. జిల్లా నుంచి దులీప్ ట్రోఫీకి ఎంపికైన మొట్టమొదటి జిల్లా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. సౌత్‌జోన్ జట్టుకు ఆంధ్రా నుంచి ఇద్దరు క్రికెటర్లు ఎంపిక కాగా.. అందులో విశాఖకు చెందిన రిక్కీబుయ్ ఒకరు కాగా.. మరొకరు త్రిపురాన విజయ్ కావడం గమనార్హం.

2023-24 సీజన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నమెంట్ అయిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో 26 వికెట్లు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. రంజీ మ్యాచ్‌లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా దులీప్ ట్రోఫీకి ఎంపికైనట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికై అందర్నీ ఆశ్చర్యపరిచిన విజయ్ తాజాగా ఏపీఎల్ నాల్గో సీజన్‌లో రికార్డు స్థాయిలో రూ. 7.55 లక్షలు దక్కించుకున్నాడు. రైటార్మ్ ఆఫ్ స్పిన్ బౌలింగ్, మిడిలార్డర్ బ్యాటింగ్‌తోపాటు బెస్ట్ ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. విజయ్ తల్లిదండ్రులు వెంకటకృష్ణరాజు, లావణ్య టెక్కలిలోని అయ్యప్పనగర్ కాలనీలో నివాసం ఉంటారు. తండ్రి సమాచారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. విజయ్ ప్రస్తుతం టెక్కలిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు.

చాలా సంతోషంగా ఉంది

దులీప్ ట్రోఫీకి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో నిలకడగా రాణించి జట్టు విజయాల్లో భాగస్వామ్యం అవుతాను. త్వరలో జరగనున్న ఏపీఎల్‌లో రాణించేందుకు కఠోర సాధన చేస్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, కోచ్‌లు, సంఘ పెద్దలకు కృతజ్ఞతలు.

– త్రిపురాణ విజయ్, క్రికెటర్

శోక సంద్రం


దున్న దుర్యోధన (ఫైల్) తిమ్మల జశ్వంత్ (ఫైల్) రాయల రాజేష్ (ఫైల్)

- భావనపాడు తీరంలో ముగ్గురు విద్యార్థులు గల్లంతు
- ఎంత గాలించినా దొరకని ఆచూకీ
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

తీరం శోక సంద్రమైంది. సముద్ర ఘోషకు మించి రోదనలు వినిపించాయి. బంగారు భవిష్యత్ ఉన్న ముగ్గురు పిల్లల గల్లంతు కావడంతో వారి తల్లిదండ్రుల కన్నీరు కలిసి కెరటాలు పోటెత్తాయి.


గల్లంతైన ప్రాంతం వద్ద ఉన్న వారి దుస్తులు, చెప్పులు

సంతబొమ్మాళి/వజ్రపుకొత్తూరు:

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో మంగళవారం ముగ్గురు పాలిటెక్నిక్ విద్యార్థులు గల్లంతయ్యారు. వజ్రపుకొత్తూరు మండలం మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన(18), పూడి జగన్నాథపురానికి చెందిన తిమ్మల జశ్వంత్ (18), పలాస మండల టెక్కలిపట్నంకు చెందిన రాయల రాజేష్(18)లు స్నేహితులు. వీరు ముగ్గురు విజయనగరంజిల్లా గజపతినగరంలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నారు.

వారం కిందటే స్వగ్రామాలకు..

వీరు వారం కిందటే స్వగ్రామాలకు వచ్చారు. అందరూ క్లాస్‌మేట్స్ కావడంతో మంగళవారం సాయంత్రం భావనపాడు సముద్ర తీరానికి వచ్చి స్నానాలకు దిగారు. స్నానం చేసే సమయంలో సముద్రంలో ఆటు-పోటు ఎక్కువ కావడంతో 20 మీటర్ల మేర సముద్రం వెనక్కి వెళ్లింది. ఆ ప్రాంతమంతా ఇసుక మేటలతో ఉండడం వల్ల అనువుగా ఉంటుందని భావించి యువకులంతా అక్కడకు వెళ్లారు. కానీ వారు వెళ్లిన కాసేపటికే సముద్రపు పోటు ఎక్కువ కావడంతో నీరు ముందుకు రావడం వల్ల ఉవ్వెత్తున ఎగసి పడిన రాకాసి అలలకు విద్యార్థులు గల్లంతయ్యారు. ఆ సమయంలో దగ్గరలో మత్స్యకారులు ఎవరూ లేకపోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. విద్యార్థుల ఆర్తనాదాలు వినేవారే కరువైపోయారు. ప్రమాదం జరిగిన స్థలానికి కొద్ది పాటి దూరంలో కొందరు మత్స్యకారులు గేలంతో చేపలు పడుతున్నారు. మత్స్యకారులు వీరిని గమనించి సంఘటన స్థలానికి వచ్చేలోపే ముగ్గురూ కనిపించకుండాపోయారు. బోట్లలో వెళ్లి గాలించినా విద్యార్థుల ఆచూకీ దొరకలేదు. డ్రోన్ కెమెరాతో వెతికినా ఆచూకీ లభించలేదు. సంఘటనా స్థలానికి తహసీల్దార్ హేమసుందరరావు, తన సిబ్బందితో చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. నౌపడ ఎస్ఐ నారాయణరావు, మెరైన్ పోలీసులు, మత్స్యకారుల సాయంతో రాత్రంతా గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని సందర్శించారు. రాత్రి 9 గంటల వరకు జాడ కనిపించకపోవడంతో పది మంది యువకుల ప్రత్యేక బృందంతో సముద్రంలో గాలింపు చర్యలు ప్రారంభించారు. మరో పక్క చేతికి అందివచ్చే కుమారులు గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.


తీరంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు


సంఘటనా స్థలం వద్ద తహసీల్దార్ హేమసుందరరావు, పంచాయతీ కార్యదర్శి రాజు, తదితరులు

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడి తల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు చెల్లించారు. ఆలయం వెనుక వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు ప్రమాద బీమా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన అధికారులు మోటారు ప్రమాద బీమా కంపెనీల అధికారులు లోక్ అదాలత్‌లో పాల్గొని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓలు కీలకంగా వ్యవహరించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

పార్వతీపురం రూరల్: ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఎంపీడీఓలు కీలకంగా వ్యవహరించాలని జెడ్పీ సీఈఓ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం) లో ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంపీడీఓలతో పాటు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల కార్యాచరణ ప్రతి పంచాయతీలో కచ్చితంగా అమలు కావాలన్నారు. నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని, ఈ మేరకు నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఎస్‌డబ్ల్యూపీసీ ఆవశ్యకతను వివరించాలని కోరారు. ఈ శిక్షణలో డీపీఓ కొండలరావుతో పాటు డీఎల్‌పీఓ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గంట్యాడ: మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రాగా మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం దాటిన తర్వాత గల మామిడి తోటలో పేకాటశిబిరంపై పోలీసులు దాడిచేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ.58,750 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

మండల సమాఖ్య సమావేశం

గజపతినగరం: వార్షిక రుణ మరియు జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వెలుగు ఏపీఎం నారాయణ రావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలు, ఎన్యుమరేటర్‌లకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. డ్వాక్రా సంఘ మహిళలకు జమ, చెల్లింపులు, ఆదాయం, ఖర్చులు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజి అప్పులు తదితర వంటి వాటిపై పూర్తిగా అవగాహన కలిగేలా చేయాలని చెప్పారు. పొదుపు మహిళలు తమ వద్ద ఉన్న రికార్డులను పారదర్శకంగా మెయింటైన్ చేస్తూ ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. పలువురు సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై.. లోకేష్ నోరు మూగబోయిందా?

• వామపక్ష, ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతల ఆగ్రహం



విజయనగరం గంటస్తంభం: స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని వామపక్ష నేతలు, సభ్యుల ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చేస్తున్న ధర్నా

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్ ప్రజలను విద్యుత్ చార్జీలు, అదానీ స్మార్ట్ మీటర్లతో నిలువు దోపిడీ చేస్తున్న చంద్రబాబు నాయకత్వంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల ప్రజా వేదిక నేతృత్వంలో దశల వారీ పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, తమ్మినేని సూర్యనారాయణలు తెలిపారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం విజయనగరం కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ..ప్రతిపక్షంలో చంద్రబాబు ఉండి బాదుడే బాదుడు అనే కార్యక్రమాలు చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమని ఇప్పటికే భారంగా ఉన్న చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీలు ఇచ్చి నేడు ఆ హామీని విస్మరించడం అంటే ఒడ్డు చేరాక తెప్ప తగలేసిన చందాన ఉందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని చంద్రబాబు సుపుత్రుడు లోకేష్ ఆనాడు పిలిపునిచ్చారని నేడు అదే స్మార్ట్ మీటర్లు ఇంటింటికి వచ్చి బిగిస్తుంటే లోకేష్ నోరు మెదపకుండా ప్రజలకు నమ్మకద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి పాలకులు పూనుకుంటున్నారన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు, ట్రూ అప్ చార్జీల విధానాన్ని తొలగించి, అదనపు భారాలు తగ్గించేవరకు, సెకీ ఒప్పందాలు రద్దు చేసే వరకు దశల వారీ పోరాటం చేస్తామని, ఈ పోరాటంలో ప్రజలందరూ సహకరించి ప్రత్యక్ష భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, బూర వాసు, రెడ్డి శంకరరావు, పి.రమణమ్మ, రాము తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలి

పార్వతీపురం: ప్రజాభిప్రాయానికి భిన్నంగా బిగిస్తున్న అదానీ స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దుచేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ సుంకాల రూపంలో రూ.12,717కోట్ల బాదుడుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లతో శాశ్వత దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అదానీ స్మార్ట్‌మీటర్లు, సోలార్, విద్యుత్ ఒప్పందాలతో కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలతో భారం మోయలేక ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు నత్తనడకన సాగుతుండగా, ప్రజలపై భారాలు వేగంగా మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నేడు స్మార్ట్‌మీటర్లను ఎలా బిగిస్తుందని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టండి అని స్వయంగా నారా లోకేష్ పిలుపునిచ్చారని, నేడు అందుకు విరుద్ధంగా బిగిస్తున్నారని దుయ్యబట్టారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని నిలుపుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.వెంకటరమణ, కె.మన్మథరావు, రైతు కూలీ సంఘ నాయకుడు డి.వర్మ, పి.ఈశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, బి.దాసు, పి.సంగం, పి.శ్రీనునాయుడు, బాషా సూరిబాబు, బి.లక్ష్మి, జి.సర్వేశ్వరరావు, రాము, బలరాం, పి.రంజిత్ కుమార్, ఈవీనాయుడు, జి.తులసి, ఎం. గౌరి, బి.జయమ్మ, పి.సన్యాసిరావు, ఎస్.ఉమ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు..!

• తగ్గిన పిల్లల సంఖ్య
• గర్భిణులు, బాలింతలది అదే పరిస్థితి



విజయనగరం పట్టణంలో ఇద్దరు పిల్లలతో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



గంట్యాడ మండలంలోని పెదవేమలిలో నలుగురు పిల్లలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో పాటు, ఇతర లబ్ధిదారుల సంఖ్య కూడా తగ్గుతోంది. పిల్లలతో కళకళలాడిల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలు తక్కువగా ఉండడంతో బోసిపోతూ దర్శనమిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల సంఖ్య పెంచాల్సిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటా అంగన్‌వాడీ బాట పేరిట పిల్లలను కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు కార్యక్రమాలు చేపడతారు. ఈఏడాది కూడా చేపట్టారు. కానీ పిల్లల సంఖ్య మాత్రం పెరగలేదు.

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు బాడంగి, భోగాపురం, చీపురుపల్లి, గజపతినగరం, గంట్యాడ, గరివిడి, బొబ్బిలి రూరల్, రాజాం, ఎస్.కోట, విజయనగరం, వియ్యంపేటలలో ఉన్నాయి.

ప్రాజెక్టుల వారీగా లబ్ధిదారుల వివరాలు (2024లో)

ప్రాజెక్టు	గర్భిణులు	బాలింతలు	మూడేళ్ల లోపు	ఆరేళ్ల లోపు
బాడంగి	593	763	3131	2094
భోగాపురం	1026	1012	5422	2932
చీపురుపల్లి	536	652	3069	1816
గజపతినగరం	447	591	2550	1572
గంట్యాడ	513	672	2851	1810
గరివిడి	464	503	2427	1366
బొబ్బిలిరూరల్	616	616	2988	1777
రాజాం	993	1193	5481	3432
ఎస్.కోట	506	555	2806	1514
విజయనగరం	725	803	4292	2002
వియ్యంపేట	1735	1907	10025	3586

గత ఏడాది కంటే తగ్గిన చేరికలు

గత ఏడాది కంటే ఈఏడాది అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతల సంఖ్య తగ్గింది. గత ఏడాది గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల లోపు పిల్లలు, 3నుంచి 6 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య 86,354 మంది ఉన్నారు. ఈఏడాది 80,881 మంది మాత్రమే ఉన్నారు.గత ఏడాది కంటే ఈఏడాది 5483 మంది లబ్ధిదారులు తగ్గారు.

పోలీసు కుటుంబానికి 'చేయూత'

• మృతిని భార్యకు రూ.1,48,600 చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత తదితరులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసి, ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందిన నర్సింహ పట్నాయక్ కుటుంబానికి పోలీస్ సిబ్బంది 'చేయూత' కింద రూ.1,48,600 చెక్కును ఆయన సతీమణి స్వర్ణలత పట్నాయక్‌కు ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ ఎవరైనా ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మరణించిన ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు 'చేయూత 'పథకం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. శాఖలో ప్రతి సిబ్బంది కొంత నగదును పోగు చేసి, వారి కుటుంబాలకు చేయూతగా అందజేయడం ఎప్పటినుంచో వస్తోందని ఈ తరహా పని చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఓ పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

19న పీ4 కార్యక్రమం

• కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పీ4 సమీక్ష సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: ఈనెల 19న పీ4 కార్యక్రమం ప్రారంభానికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కలెక్టర్లతో ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. ఈ మేరకు స్వచ్ఛందంగా మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో కలెక్టర్, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలపై సీఎం దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. 2029 నాటికి బంగారు కుటుంబాలను పీ4 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసి ఆర్థిక అసమానతలను తొలగించేలా తొలి అడుగు వేయబోతున్నామని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2047 నాటికి ఆర్థిక సమానత్వం సాధించాలని సీఎం పేర్కొన్నట్లు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, ఉప కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, జిల్లా ప్రణాళిక అధికారి ఆర్‌కె పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన వర్సిటీ 7వ వ్యవస్థాపక దినోత్సవం



వివిధ పోటీల విజేతలతో యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్

విజయనగరం అర్బన్: పట్టణంలోని కేంద్రియ గిరిజనయూనివర్సిటీ 7వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను ప్రారంభించిన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉత్తమ బోధనల కోసం యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కృషిని ప్రశంసించారు. యూనివర్సిటీ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భువనేశ్వర్‌కు చెందిన రాజకీయ విశ్లేషకుడు, మాజీ అధ్యాపకుడు డాక్టర్ అభిరాం బిశ్వాల్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థిరమైన అభివృద్ధి కోసం అనుసరించాల్సిన అంశాలు, ప్రగతి శీల విధానాలు, విద్యా ప్రమాణాల పరిరక్షణ, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా మార్గదర్శక సూత్రాలను పాటించాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా యూనివర్సిటీ గణాంకాలను ప్రస్తావిస్తూ మౌలిక వసతులతో కూడిన శాశ్వత క్యాంపస్‌కు విద్యార్థులను త్వరలో తరలిస్తామన్నారు. అనంతరం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథి అందజేశారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ బొంతు కోటయ్య సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో డీన్ ఆఫ్ సోషల్ హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ దీపక్ మోహన్‌రావు షిండే, లైబ్రేరియన్ డాక్టర్ శంకర్‌రెడ్డి కొల్లే, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయితో నిందితుడి పట్టివేత



గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడితో రూరల్ పోలీసులు

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా కలిగి ఉన్న వ్యక్తిని ఎస్సై అశోక్‌కుమార్ మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పడాలపేటకు చెందిన పిన్నింటి తేజేశ్వర్ సీఆర్‌నగర్ జంక్షన్ వద్ద ఒక బ్యాగుతో అనుమానాస్పదంగా ఉండడాన్ని గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా కేజీ 160 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే స్టేషన్‌కు తీసకువచ్చి విచారణ చేయగా ఒడిశా నుంచి ఒక వ్యక్తి రైల్వేస్టేషన్‌కు వచ్చి బ్యాగ్ ఇచ్చాడని, ఆ బ్యాగులో ఉన్న గంజాయిని అమ్మితే తనకు కొంత డబ్బులు ఇస్తారని నిందితుడు చెప్పాడు. అయితే ఎవరా ఒడిశా వ్యక్తి, సరఫరా ఎలా జరుగుతుంది? ఎక్కడి నుంచి వస్తుందన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు.

గిరిజన మహిళంటే చిన్నచూపా..?

• సర్పంచ్‌కు ప్రొటోకాల్ ఉండదా..
• పింఛన్ల పంపిణీకి హాజరు కావద్దా
• అనారోగ్యమని తెలిసీ అవహేళన
• గిరిజన మహిళా సర్పంచ్ ఆవేదన



బొడ్డవర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సర్పంచ్ మీనా తదితరులు

శృంగవరపుకోట: ప్రజాస్వామ్య వ్యవస్థలో గిరిజన ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ వర్తించదా? గిరిజన మహిళనని చిన్నచూపా? అంటూ మండలంలోని మూలబొడ్డవర గ్రామ గిరిజన మహిళా సర్పంచ్ దేవాపురపు మీనా మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామసచివాలయంలో పలువురు గ్రామస్తులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త పింఛన్ల పంపిణీని కనీసం తనకు చెప్పకుండా చేశారని, ప్రొటోకాల్ గిరిజన సర్పంచ్‌లకు ఉండదా? అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి తనను ఎస్టీ మహిళనని లోకువగా చూస్తున్నారని, ఉద్యోగం వదిలేసి రాజకీయాలు చేస్తున్నారని, దీనివల్ల అభివృద్ధి ఆగిపోయి, గ్రామంలో విభేదాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని ఏర్పాటు చేయాలి. పాతికకు పైగా గిరిశిఖర గ్రామాలున్న రెండు పెద్ద గిరిజన పంచాయతీలైన ధారపర్తి, బొడ్డవరలకు ఒక్క కార్యదర్శిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. గిరిజన పంచాయతీలన్న చిన్నచూపుతోనే అధికారులు ఇలా చేస్తున్నారన్నారు. రెండు పంచాయతీలకు ఒక్కరే కార్యదర్శి కావడంతో అక్కడ, ఇక్కడ ఉన్నామని చెబుతూ కాలక్షేపం చేస్తున్నారన్నారు. సర్పంచ్ ఆచూకీ చెబితే బహుమతి ఇస్తామని వాట్సాప్ గ్రూప్స్‌లో ఎవరో పంపిన మెసేజ్‌లు ఎంపీటీసీ ఫార్వర్డ్ చేయడం సరికాదని, తప్పు చేస్తే జనం మధ్యనే నిలదీయాలన్నారు. ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వెళ్లానని తెలిసీ ఎంపీటీసీ తనను హేళన చేయడం అత్యంత బాధాకరమన్నారు.



సచివాలయంలో సమావేశానికి హాజరైన గిరిజన ప్రజలు

రెగ్యులర్ సెక్రటరీని నియమించాలి

ఈ సందర్భంగా సచివాలయం నుంచి కార్యదర్శికి సర్పంచ్ మీనా ఫోన్ చేసి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని అడిగితే కార్యదర్శి కాల్ కట్ చేయడంతో ఇదీ మా కార్యదర్శి పనితీరు చూశారుగా అన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశామని, అధికారులు చర్యలు తీసుకుని, బొడ్డవర పంచాయతీకి రెగ్యులర్ సెక్రటరీని నియమించాలని కోరారు. సమావేశంలో గ్రామ పెద్ద డి.సన్యాసినాయుడు మాట్లాడుతూ ఆర్నెలలుగా సర్పంచ్ పని చేయకపోతే ఎంపీటీసీ చేశారా? జనం మధ్య తేల్చండి. మేము పనిచేయలేదని, అందుబాటులో లేమని చెబితే ఇప్పుడే సర్పంచ్‌తో రాజీనామా చేయిస్తానన్నారు. పనులకు సర్పంచ్ కావాలి కానీ పింఛన్లు పంపిణీ చేసినప్పుడు ప్రొటోకాల్ అవసరం లేదా? గిరిజనులం అని చులకన చేస్తున్నారని వాపోయారు. 90శాతం ఓటర్లు గిరిజనులు, దళితులు, బీసీలు ఉన్నా ఇక్కడ రాజరికం చేయాలనుకోవడం, అధికారులను బెదిరించి గిరిజన నేతలను ఇబ్బందులు పెట్టడం సరికాదని గిరిజన సంఘం నేత జె.గౌరీష్ అన్నారు.

పశుగ్రాస విత్తనాలు సిద్ధం

వేపాడ: పాడి రైతులకు 75శాతం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పశువైద్యాధికారిణి కొటాన గాయత్రి చెప్పారు. వేపాడ మండలానికి 400కిట్లు సీఎస్‌హెచ్ 24 ఎం.ఎఫ్ జొన్న విత్తనాలు వచ్చాయన్నారు. 5కిలోల బ్యాగ్ ఖరీదు రూ.460 కాగా 75శాతం రాయితీ పోగా రైతులు రూ.115లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఆర్.ఎస్.కెలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సత్యసాయి సేవా సంస్థ విజయనగరం జోన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 86 మందికి పరీక్షలు చేసి 34 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో శ్రీను, సన్యాసినాయుడు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ దివ్య ప్రశాంతి, మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, భాను పాల్గొన్నారు.

శాస్త్రం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి

• డీఈఓ యూ.మాణిక్యంనాయుడు



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలని ఆ దిశగా వారిలోని ఆలోచనలతో కూడిన ప్రాజెక్టుల రూపకల్పనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ యు.మాణిక్యంనాయుడు అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రచైతన్యాన్ని పెంపొందించడం, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం లక్ష్యంగా 'ఇన్‌స్పైర్-మనక్' కార్యక్రమం నిర్వహణలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయుల కోసం స్థానిక పీఎస్ఆర్ఈఎం స్కూల్‌లో మంగళవారం చేపట్టిన ఒక రోజు ఓరియంటేషన్ తరగతిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజు మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక, పరిసరాలకు అనుగుణంగా సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు రూపకల్పన చేయాలని సూచించారు. అనంతరం ఇన్‌స్పైర్ పోస్టర్, ఏపీఓఎస్ఎస్ ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రిసోర్స్ పర్సన్‌లుగా ఎ.భానుప్రకాష్, అరసాడ సురేంద్రనాథ్, ఎస్.ఉమామహేశ్వరరావు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ బూరి వేణుగోపాల్‌రావు వ్యవహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కేవీరమణ, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ జి.సన్యాసినాయుడు, డివిజన్ పరిధిలోని సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

పది చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

• వివరాలు తెలిపిన రూరల్ సీఐ గోవిందరావు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు

పార్వతీపురం రూరల్: పది చోరీ కేసులకు సంబంధించిన నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సమావేశలో మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం బట్లభద్ర గ్రామానికి చెందిన తామడ సంతోష్ రాత్రి వేళల్లో బయట పడుకునేవారి ఇళ్లల్లోకి వెళ్లి బంగారు ఆభరణాలు, నగదు చోరీకి పాల్పడుతున్నట్లు తెలిపారు.

ఈ మేరకు నిందితుడ్ని బలిజిపేటలో అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితుడి నుంచి 10తులాల బంగారు ఆభరణాలు, రూ.13వేల నగదుతో పాటు బొబ్బిలి ప్రాంతానికి చెందిన ద్విచక్ర వాహనదారుడిని మోసం చేసి బైక్‌తో పరారైన కేసులో ఆ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు పురోగతికి సహకరించిన పోలీసు అధికారులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు. సమావేశంలో సీసీఎస్ పోలీసు అధికారులతో పాటు బలిజిపేట, కొమరాడ, సీతానగరం, పార్వతీపురం రూరల్ ఎస్సైలు, సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.